

# అక్కడే ఆగక

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

**(గత సంచిక తరువాయి)**

**ఆ రాత్రి పనయ్యాక** రాత్రి ఏడున్నరకి చైత్ర తల్లికి ఫోన్ చేసింది.

"ఆద్య ఎలా ఉంది?" ప్రవర్ధన మొదటి ప్రశ్న.

"బానే ఉంది."

"ఏదైనా చెప్పిందా?"

"నాతో ఆ విషయం ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అసలు పెద్దగా మాట్లాడటంలేదు."

"ఇంకా ఏడుస్తూనే ఉందా?"

"లేదు. ఆపింది."

"ఏం ఏడుపమ్మా ఆ ఏడుపు? ముసురు పట్టిన వానలా కంట్లోంచి కన్నీరు కారుతూనే ఉంది."

"విమానంలో దారంతా కూడా ఏడ్చానని చెప్పింది. దాన్లో ఇప్పుడు నేను ఏడుపుని చూడటంలేదు. బాధని మాత్రమే చూస్తున్నాను."

"నేను కూడా అక్కడికి రావాల్సింది" ప్రవర్ధన బాధగా చెప్పింది.

"రాకపోవడమే మంచిదని ఒద్దన్నానమ్మా."

"ఒంటరిగా అఘాయిత్యం ఏం చేయదుగా?" ఆవిడ కంఠంలో భయం.

"చేయదు."

"అంత గట్టిగా ఎలా చెప్పగలవు?"

"ఎప్పుడైతే అది గోళ్ళరంగు తాగాక తనకేదో ఐపోతోందని గ్రహించి 'అమ్మా' అని అరిచిందో అప్పుడే దానికి చావంటే భయమని నాకు అర్థమైంది. ఆవేశంలో, బాధ తీవ్రతలో అది అనాలోచితంగా చేసిన తప్పు. సైడ్ ఎఫెక్ట్‌గా పాపం దానికి కొంత మతిమరుపు వచ్చింది."

"ఆ మతిమరుపుకి వాడిని మర్చిపోయినా బాగుండేది ఉంటాను. జాగ్రత్త తల్లీ" ప్రవర్ధన లైన్ కట్ చేసింది.

బాత్‌రూముకి వెళ్ళాల్సి రావడంతో ఆద్యకి మెలుకువ వచ్చింది. టైం చూస్తే రాత్రి తొమ్మిదిన్నర. అక్క ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతోంది. కాని ఆ భాష అర్ధం కాలేదు.

"లేచావా డాలీ! బాగా నిద్రపట్టినట్లుంది? నిన్ను నిద్రలేపుదామని అనుకున్నానుకాని లేవబుద్ధి కాలేదు."

"నువ్విప్పుడు ఏ భాషలో మాట్లాడావు?" ఆద్య అడిగింది.

"ఫ్రెంచ్."

"నీకు ఫ్రెంచ్ కూడా వచ్చా?"

నేను పనిచేసే స్క్లంబర్జే ఫ్రెంచ్ వాళ్ళు పాలించారు. కాబట్టి అక్కడ ఫ్రెంచ్ తప్ప ఎవరికీ ఇంగ్లీష్ రాదు. ఈరెండు చోట్లా ఫ్రెంచ్ నేర్చుకున్నాను. బ్రెజిల్‌లో కూడా కొన్నేళ్ళు పనిచేసాను కాబట్టి కొంచెం పోర్చుగోస్ కూడా వచ్చు."

కొద్దిసేపాగి చైత్ర నవ్వి చెప్పింది.

"కాని వంద భాషలు నేర్చుకోవడంకన్నా సరైన సమయంలో 'నో' చెప్పగలగడం నేర్చుకున్నవాడు పండితుడు. మన జీవితాల్లోని చాల సమస్యలకి కారణం 'ఎస్'ని వెంటనే చెప్పడం, 'నో'ని ఆలస్యంగా చెప్పడం. మనకి మనం నో చెప్పుకుని ఇతరులకి ఎస్ చెప్పకూడదు. లేదా వైస్ వర్సా. అన్నం వడ్డించనా? నీకు ఇష్టమని బెండకాయ కూర చేసాను."

ఇద్దరూ మౌనంగా తిన్నారు. భోజనం చేసేప్పుడు చైత్ర మొబైల్లో ఓ ప్రోగ్రాం పెట్టుకుని చూసింది. అందులోంచి డైలాగ్ కాక కేండ్ లాఫ్టర్ కూడా వినిపిస్తోంది.

"మజ్జిగ, పెరుగు లేవా?" ఆద్య చివర్లో అడిగింది.

"ఈ దేశంలో ఆవులు, గేదెలుండవు. అవి దొరకవు."

ఆద్యకి పెరుగన్నం తినందే తిన్నట్లుండదు.

"ఘానాలో మనకి కావాల్సిన చాలా దిగుమతి అవుతూంటాయి. ఎక్కువగా యు.కె నించి. విమానం వస్తే యోగర్ట్ కప్స్ దొరుకుతాయి. ఇక్కడ గార్డెన్ మార్ట్ అనే చిన్న షాప్ ఉంది. వాళ్ళు ఎక్స్‌పాట్రియాట్స్ కోసం ఇంపోర్టెడ్ ఐటెమ్స్ తెప్పిస్తారు. ఇక్కడ పధ్నాలుగు దేశాలవాళ్ళు పనిచేస్తున్నారు. అవి వచ్చాయని తెలిస్తే చాలు. అంతా ఎగబడతారు. రోజులో మొత్తం ఖాళీ."

భోజనాలు అయ్యాక ఆద్య ప్లేట్ కూడా తీసి సింక్‌లో ఉంచింది. తర్వాత ఆమె లాప్‌టాప్‌లో పనిచేసుకుంటూంటే ఆద్య మళ్ళీ తనకి తెలీకుండానే సోఫాలో నిద్రపోయింది.

పదిన్నరకి చైత్ర లేపి చెప్పింది.

"బెడ్‌రూములోకి వెళ్ళి పడుకో. పై బెడ్‌రూంలో నీ పక్క అరేంజ్ చేసాను."

చైత్ర తలుపు మూసి లోపల గడియకి స్టీల్ మగ్‌ని తగిలించి, అందులో మూడు చెంచాలని ఉంచింది.

"దేనికి?" చెల్లెలు ఆశ్చర్యంగా అడిగింది.

"హోం మేడ్ బర్గలర్ అలారం" చైత్ర నవ్వి జవాబు చెప్పింది.

"ఇక్కడ దొంగల భయం ఉందా?" ఆద వెంటనే అడిగింది.

"ఎంతమాత్రం లేదు. ఘానా ప్రశాంతమైన దేశం. ముఖ్యంగా మనిల్లు భద్రమైన ప్రదేశం. బయట గార్డ్స్ ఇరవై నాలుగు గంటలూ డ్యూటీలో ఉంటారు. కాంపౌండ్ వాల్ పైన ఎలక్ట్రిఫైడ్ కంచె కూడా ఉంది. కాంగోలో ఉన్నప్పుడు దీన్ని అలవాటుగా చేసుకున్నాను. అది మంచిదేశం కాదు. అలవాటు తప్పకూడదని. నేను రేపు ఉదయం సరిగ్గా ఏడుం ముప్పావుకి ఆఫీస్‌కి బయల్దేరుతాను. ఎనిమిదింపావుకి మెయిడ్ వస్తుంది. సెక్యూరిటీలో డూప్లికేట్ తాళం తీసుకుని లోపలికి వచ్చి పనిచేసుకుని వెళ్తుంది. నీగది తలుపు వేసి ఉంటే నిన్ను డిస్టర్బ్ చేయద్దని చెప్పాను. ఇల్లూడ్చి, తుడిచి, సింక్‌లో గిన్నెలు తోమి, బాత్‌రూమ్స్ కడిగి వెళ్తుంది. వాషింగ్ మెషిన్‌లో బట్టలని ఉతుకుతుంది. ఇక్కడ కరెంట్ కట్ చాలా ఎక్కువ. బయట జనరేటర్ ఉంది. కాని ఒకోసారి ఆయిల్ ఉండదు. కరెంట్ లేకపోతే బయట సర్వెంట్ రూములో బట్టలని ఉతుకుతుంది. మెయిడ్‌కి ఇంగ్లీష్ వచ్చు. నిజానికి ఈ దేశంలోని అందరికీ ఇంగ్లీష్ వచ్చు. మన దేశాన్ని బ్రిటీష్ వారు పాలించినా మనందరికీ ఇంగ్లీష్ రాదు. కానీ ఘానా ప్రజలందరికీ ఇంగ్లీష్ వచ్చు. పిల్లలు కూడా మాట్లాడుతారు. ఇక్కడ ఇంగ్లీష్ అఫీషియల్ లాంగ్వేజ్ ట్వై వీరి స్థానిక భాష. మరికొన్ని భాషలు కూడా మాట్లాడుతూంటారు."

అక్క తనని జినేంద్ర గురించి ఎలా పరిచయమయ్యాడు, వారి మధ్య ఏం జరిగిందిలాంటివి గుచ్చిగుచ్చి అడిగి తిడుతుందని ఎదురుచూసింది. కాని చైత్ర అసలా ప్రసక్తే ఎత్తకపోవడంతో ఆద్యకి కొంత ఉపశమనంగా ఉంది. తనని ఫూల్‌లా చూస్తోందా అనే అసౌకర్యంగా కూడా ఆమెలో ఉంది. 'రేపు ఆఫీస్‌నించి వచ్చాక అడుగుతుంది' అనుకుంది. చైత్ర ఓ మొబైల్‌ని ఇచ్చి చెప్పింది.

"ఇది లోకల్ సిమ్ ఫోన్. అవసరమైతే నాకు ఫోన్ చేయడానికి ఉపయోగిస్తుంది. అన్నట్లు కొత్తపల్లి స్వీట్స్ అమ్మ ఇచ్చిందా? రేపు నా కొలీగ్స్‌కి తీసుకెళ్తాను."

"నేను తింటాననేమో అమ్మ కేరీ ఆన్‌లో పెట్టింది. తీసుకో" ఆద్య చెప్పింది.

"థ్యాంక్స్ అండ్ గుడ్‌నైట్. నేను కొద్దిసేపు పుస్తకం చదువుకుని పడుకుంటాను. ప్రతీరాత్రి అది అలవాటు."

ఆద్య తన గదిలోకి వెళ్ళి మంచం పక్కన టీపాయ్‌మీద కలరింగ్ బుక్స్‌ని, కలర్ క్రేయాన్స్‌ని చూసింది. పడుకున్నా ఆమెకి నిద్రపట్టలేదు. మాటిమాటికీ తను అకస్మాత్తుగా ఎలాంటి పరిస్థితిలో వేల మైళ్ళ సముద్రాలు దాటి వచ్చిందో, అందుకు కారణమైన జినేంద్ర గుర్తుకి రాసాడు. పక్క గదిలోని చైత్రకి చెల్లెలు సన్నగా రోదిస్తున్న శబ్దం వినిపిస్తున్నా లేచి వెళ్ళి ఓదార్చలేదు.

అరగంట తర్వాత తల పగిలిపోతూంటే ఆద్య లేచి లైట్ వేసి కలరింగ్ బుక్స్‌ని, కలర్ క్రేయాన్స్‌ని అందుకుని వాటికి కలర్స్ వేయసాగింది. అది మైండ్‌ని సమస్య మీంచి డైవర్ట్ చేయడంతో కొద్దిసేపట్లో మనసు నిలకడై పుస్తకంలోని బొమ్మలని కలర్ చేస్తూండిపోయింది. ముప్పావుగంట తర్వాత నిద్ర వచ్చింది. చైత్ర లైటార్పి పడుకున్న నాలుగైదు నిమిషాలకే ఆద్యకి నిద్ర పట్టేసింది.

11

భర్తని భార్యలా మరెవరూ అర్థం చేసుకోలేరు.

ఆద్య వెళ్ళిన మర్నాటి రాత్రి సంజీవ భార్యతో చెప్పాడు.

"నేను సూర్యచంద్ర ఇంటిదాకా వెళ్ళొస్తాను."

సంజీవ, సూర్యచంద్ర ఒకే స్టూడెంట్స్ హాస్టల్లో ఉండి చదువుకున్నారు. ఆ హాస్టల్లోని విద్యార్థులు వివిధ ఫేకల్టీలకి చెందినవారు. చాలామంది ఆ తర్వాత అనేక వృత్తుల్లోకి వెళ్ళారు. ముప్పై ఏళ్ళు దాటినా వారిలో కొందరిమధ్య స్నేహం ఇంకా కొనసాగుతూనే ఉంది వీరిద్దరిదీ బదిలీ అయే ఉద్యోగం కాదు కాబట్టి, ఒకే ఊరులో ఉంటున్నారు కాబట్టి తరుచు కలుసుకునే అవకాశం ఉండి, వారి మధ్య స్నేహం కొనసాగుతూనే ఉంది .సూర్యచంద్ర ప్రతీరాత్రి తాగుతాడని ప్రవర్ధనకి తెలుసు.

"అలాగే నడిచి వెళ్ళండి. ఎక్కువ తాగకండి" ఆవిడ సూచించింది.

సంజీవ కాలినడకన సూర్యచంద్ర ఇంటికి పావుగంటలో చేరుకున్నాడు. అది చాలాకాలం క్రితం కట్టిన టు బెడ్ రూం అపార్ట్‌మెంట్. సంజీవని చూసిన సూర్యచంద్ర ఆనందంగా ఆహ్వానించాడు.

"రారా జీవా. ఆ మధ్య మీ ఇంటికి వస్తే నువ్వు లేవు. మీ ఆవిడ చెప్పే ఉంటుంది. మర్నాడు వస్తావని ఎదురు చూసాను. రాలేదు" నిష్టూరంగా చెప్పాడు.

"ఇంతకీ విషయం ఉందా? తెమ్మంటావా?" సంజీవ అడిగాడు.

"లేకుండా పోవడానికి నేను పోలేదుగా. నేను స్పిరిచువల్ పర్సన్‌ని. స్పిరిట్స్ కూడా నన్ను లైక్ చేస్తాయి. రమ్మా? బ్రాందీనా?"

"ఉంటే ఓల్డ్ మాంక్ రమ్. లేదా మేన్షన్ హౌస్ బ్రాందీ. ముందు మీ నాన్నగారిని పలకరించి వస్తాను."

"అలాగే. నువ్వాయన్ని పలకరించేలోగా నేను రమ్మ్ ని పలకరిస్తాను. బాల్కనీలోకి రా."

సంజీవ ఆయన గదిలోకి వెళ్ళాడు. ఆయన ఈజిల్ మీద బొమ్మని గీస్తున్నాడు.

"ఒంట్లో ఎలా ఉంది అంకుల్?" పలకరించాడు.

"వృద్ధాప్యం అంటే సముద్రంలో చెలరేగిన తుఫానులాంటిది. ఓసారి ఓడెక్కాక ఇక మనం ఏం చెయ్యలేం. అన్ని రోగాలు వృద్ధాప్యంలో వచ్చి కలుస్తాయి. నువ్వెలా ఉన్నావు?" ఆనయన్ అనవ్వ్ అడిగాడు.

"బానే ఉన్నాను."

"డైబెటీస్, బి.పి.లు లేవుగా?"

"ఊహూ."

"గుడ్. వస్తాను పద. ప్రతీవారికి జీవితంలోని వివిధ దశల్లోనూ మిత్రులు ఉంటారు. కాని అన్ని దశల్లో ఒకే మిత్రుడు ఉన్న మీ  ఇద్దరూ అదృష్టవంతులు" ఆయన బొమ్మకి మెరుగులు దిద్దుతూ చెప్పాడు.

సంజీవ బాల్కనీలోకి వచ్చాడు. అప్పటికే ఫ్రిజ్‌లో ఉంచిన వాటర్ బాటిల్, హాఫ్బాటిల్ రమ్ తో సూర్యచంద్ర సిద్ధంగా ఉన్నాడు. మూడు గ్లాసుల్లో రమ్ ని పోస్తూ  చెప్పాడు.

"తెలుసుగా అకేషనేం లేకపోతే బుధవారం బ్రాందీ. సోమవరం స్కాచ్. మిగిలిన రోజుల్లో రమ్."

గ్లాసుల్లో రమ్, నీళ్ళు పోసాక సూర్యచంద్ర తన గ్లాస్‌లో వేలు ముంచి కొన్ని చుక్కలు విదిలించాడు. అవి శివుడి కోసం. గ్లాసులు కలిసి ఛీర్స్ అయ్యాక సూర్యచంద్ర చెప్పాడు.

"ఓ అరటిపండు కేలరీలు నూటైదు. ఓ షాట్ రమ్ కేలరీలు తొంభై రెండు. బరువు తగ్గాలి అనుకునేవారు వాటిలో ఒకటి తెలివిగా ఎన్నుకోవాలి."

"ఇదేమిటి? ఇంత పోసావు?" సంజీవ అడిగాడు.

"గ్లాస్‌మీద ఏం రాసుందో చూడు" సూర్య చంద్ర నవ్వుతూ చెప్పాడు.

సంజీవ గ్లాస్‌ని పరిశీలిస్తే 30 ఎం.ఎల్, దానికింద దుష్మన్, 60 ఎం.ఎల్ దోస్త్, 90 ఎం.ఎల్ కొలత గీతకింద భాయ్ అని రాసివుంది.

"నువ్వు భాయ్ పెగ్ తాగితే హైకి వెళ్తవు. పుస్తాకాలు చదివితే ఎడ్యుకేటెడ్ అవుతావు. తాగుతు చదువుతూంటే హైలీ ఎడ్యుకేటెడ్ అవుతావు. అందుకే కంపెనీ లేకపోతే తాగుతూ పుస్తకాలు చదువుతూంటాను."

"మీ నాన్న నిన్నెప్పుడైనా దంచాడా?" సంజీవ అడిగాడు.

"ఊహు. మా నాన్న పిల్లల్ని కొట్టేవాడు కాదు కాని బాగా తిట్టేవాడు. ఒకే ఒక్కసారి మా నాన్న కొట్టిన దెబ్బలు గుర్తున్నాయి."

సూర్యచంద్ర నవ్వుతూ చెప్పాడు.

"ఎందుకు కొట్టాడు?"

"నా మొలతాడు తెగిపోయింది. మళ్ళీ కట్టుకోమని మా అమ్మ చెప్పినా నేను కట్టుకోకపోతే మా నాన్నకి ఫిర్యాదు చేసింది. 'వెధవా! మొగాళ్ళంతా మొలతాడు కట్టుకోవాలిరా' అని తిడితే, 'మొగతనం మొలతాడులో ఉండదు నాన్నా' అన్నాను. 'తొమ్మిదేళ్ళకే చెత్తమాటలు మాట్లాడతావా?' అంటూ కొట్టాడు."

సూర్యచంద్ర సిగరెట్ అంటించాడు. ఇద్దరి మధ్యా కాసేపు మౌనం. సూర్యచంద్ర చెప్పాడు.

"మన మేథ్స్ టీచర్ మనకో లెక్కని బోర్డ్‌మీద రాసి దాన్ని చేయమని బయటకి వెళ్ళి సిగరెట్ తాగేవారు. కిటికీలోంచి ఆయన సిగరెట్ పొగని రింగులుగా వదలడం చూసాక సిగరెట్ మీద మోజు కలిగింది. ఆయనకన్నా పెద్ద రింగుల పొగని వదలాలని నేను సిగరెట్‌ని ముట్టించాను. నాకింకా గుర్తు. దాని పేరు కేప్‌స్టన్. మన రోజుల్లో సిగరెట్ తాగేవాడంటే రౌడీ, దుర్మార్గుడని ఆడవాళ్ళు భావించేవారు. ఈనాటి సినిమాల్లో విచ్చలవిడిగా సిగరెట్, ఆల్కహాల్ తాగుతున్నారు."

"సిగరెట్ తాగితే సన్నగా ఉంటామని ఆడవాళ్ళే ఇప్పుడు సిగరెట్ తాగుతున్నారు. మన లెక్కల మాస్టారు లంగ్ డిసీజ్‌తో పోయారు. ఆయన భార్యకి పాసివ్ స్మోకింగ్ వల్ల లంగ్ డిసీజ్ వచ్చి ఓ లంగ్ తీసేసారు. నిజానికి మనం డబ్బుని ఎలా జాగ్రత్తగా ఖర్చు చేస్తామో అలా అలవాట్ల విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి. ఆయుష్షు బేంక్ ఎకౌంట్‌లాంటిది. మనం డబ్బుని బేంక్‌లో ఎలా జమ చేస్తామో అలా మన ఆయుష్షుని పెంచే ఆరోగ్యపు అలవాట్లని అలవరుచుకుని దాన్ని జమ చేసుకోవాలి. దురలవాట్లకి దూరంగా ఉండాలని, మంచి అలవాట్లని చేసుకోవాలని మన తరంలో మనకి ఎవరూ చెప్పలేదు" సంజీవ చెప్పాడు.

సూర్యచంద్ర తండ్రి వచ్చాడు. సూర్యచంద్ర ఆయనకి మూడో గ్లాస్‌ని అందించాడు.

"నాన్నగారూ. నాకు నిన్న చెప్పింది జీవాకి కూడా చెప్పండి" సుర్యచాంద్ర తండ్రిని కోరాడు.

సంజీవ్ ఆయన వంక ప్రశ్నార్ధకగా చూస్తే ఆయన చెప్పాడు.

"ఈ మధ్య నా సైక్‌లో మార్పు వస్తోంది. అది అందరిలోనూ జరుగుతోందా? లేక నాలో నేనా అని ఆలోచిస్తున్నాను."

"సైక్‌లో మార్పా?" ఏమిటది?" సంజీవ ఆసక్తిగా అడిగాడు.

సూర్యచంద్ర తండ్రి కొద్ది క్షణాలు మౌనంగా ఉండి, చిన్నగా నిట్టూర్చి చెప్పసాగాడు.

"కొన్ని నెలలుగా నాకు నా బాల్యం బాగా గుర్తుకు వస్తోంది. ఆరోజులు, ఆనాటి మనుషులు, సంఘటనలు.. ఉదాహరణకి నేను రేడియోలో వందేమాతరం వింటూంటాను. వెంటనే 'ఒరేయ్ బాబ్జీ! లేరా. స్కూల్‌కి టైం అయింది' అనే మా అమ్మ కంఠం వినిపిస్తుంది. ఆ రోజుల్లో రేడియోలో ఆ పాట వచ్చేప్పుడు మా అమ్మ లేపేదని ఇప్పుడు గుర్తుకు వస్తోంది .లేచి వెనకున్న రేకుల షెడ్ బాత్‌రూంలోకి వెళ్తాను. అక్కడి ఎర్రటి లైఫ్‌బాయ్ సోప్, దాన్ని ఉంచే ఆకుపచ్చరంగు ప్లాస్టిక్

బాక్స్ గుర్తుకి వస్తాయి. ఊహల్లో ఇంటినించి స్కూల్‌కి నడిచి వెళ్తాను. దారిలోని ఉమర్ టైలర్ షాప్, సోడా సీసాల్లో గేస్ నింపే షాప్, సుబ్బయ్య చిల్లర దుకాణంలో కొన్న నిమ్మతొనలు, దాన్ని దాటి వెళ్తే పిండిమర, అందులో ఖాకీ నిక్కర్ తొడుక్కుని దాన్ని ఆడించే బట్టతల పాల్, గణపతి బుక్ స్టోర్, రెండు వేపచెట్ల ఇల్లు, సింహాలమేడ, నన్ను దాటుకుని వెళ్తూ తాడులాగి బెల్ కొట్టే రిక్షాలు చివరికి స్కూల్‌కి చేరుకుంటాను. బడి బయట అమ్మే తేగలు, సబ్జా గింజలతో ఐస్ ముక్కలు వేసి గ్లాస్ గొట్టంతో గ్లాస్‌లో ఇచ్చే షర్బత్, ఉప్పు, కారం చల్లిన మామిడి ముక్కలు, స్కూల్ పక్కనే కిళ్ళీ కొట్టు, అందులోని నుదుట మచ్చున్న ముప్పై ఏళ్ళ వ్యక్తి, కొట్లోని సీసాల్లోని స్ట్రాంగ్ పిప్పర్‌మెంట్స్, బిళ్ళలు, సిగరెట్ ఆకారంలోని తెల్లటి బిళ్ళ, తడి బట్టకింద తమలపాకులు.. మెయిన్ గేట్‌లోంచి లోపలకి వెళ్ళి కుడివైపు జెండా వేదిక వెనక మూడో పాకలోని నా క్లాస్‌లోకి వెళ్తాను. అందులోని మా క్లాస్‌మేట్స్ కొందరి మొహాలు గుర్తుకి వస్తాయి. స్కూల్లోని బాదం చెట్టునించి కాయలు కొట్టుకుని తినడం.. వీటిని ఊహించుకుంటూంటే ఎంతో ప్రశాంతమైన ఆనందం అదే సమయంలో అవన్నీ ఎంతగా మిస్సవుతున్నానో అనే బాధ.." ఆయన కంఠం డగ్గుతికతతో ఆగింది.

సంజీవ ఆయన వంక చిత్రంగా చూసాడు.

"ఇవన్నీ ఇక తిరిగి రావనే విషాదం నన్ను అలుముకుంటోంది. మరణమంటే తిరిగి రాకపోవడమే కదా. స్కూల్ విడిచాక ఇసకలో రెడ్డి, చౌదరి, టెలిగ్రాం టీచర్ కొడుకుతో కబాడీ ఆడటం – ఈ టీచర్ బెల్ కొట్టీకొట్టగానే టెలిగ్రాంలాగా క్లాస్‌లోకి వస్తాడని ఆ నిక్ నేం పెట్టాంలే. అమ్మ వడ్డిస్తూంటే రాత్రి అందరితో కలిసి వంటగదిలో గచ్చు నేలమీద కూర్చుని తినడం, బినాకా గీత్‌మాలాలోని పాటలు వింటూ నిద్రపోవడం, నాన్నకి టవల్‌ని బాత్‌రూం రేకు తలుపు మీద ఉంచడం, ఉగాదికి వేపచెట్లు వెదికి వేపపువ్వుని కోసుకురావడం సంక్రాంతి ముగ్గులు, గొబ్బెళ్ళు, బోండాం గారింట్లో బొమ్మల కొలువుకి వెళ్ళడం, ఆవిడ దాన్ని ఎంతో చక్కగా పెట్టేది. అమ్మకి లక్షవత్తుల నోముకు ఊరంతా తిరిగి పూలు కోసుకురావడం ఊహల్లో వీటిని గుర్తు తెచ్చుకుని అనుభవించడం ఆనందాన్నిస్తున్నాయి. చెప్పాగా. అదే సమయంలో బాధని కూడా. ఐ మిస్ మై మదర్. కొత్త చింతకాయ పచ్చడి కలుపుకున్నాక ఆగమని ఇంగువ పలుకులు వేయించిన వేడి నూనెని దాంట్లో పోయడం, మా అమ్మ పక్కన కుర్చుని చేటలో బియ్యంలోని రాళ్ళు ఏరుతూ మా అమ్మ పాడే 'దేవుడు బుడతడు, కన్నెత్తి చూస్తే దొరకడు' తత్త్వం పాటని వినడం, మా అమ్మ తరిగిన బెండకాయ ముచికల్ని చేతికి అంతించుకుని 'చూడమ్మా! నాకు కురుపులు వచ్చాయి' అనడం, మా అమ్మ విసిరే వడ్లకోసం వేచి చూసే పిచ్చుకలు, మా అమ్మ వంట వండుతూ పాడే లక్ష్మీ అష్టోత్తర స్తోత్రం అవన్నీ ఇప్పుడు నన్ను హాంట్ చేస్తున్నాయి."

సూర్యచంద్ర తండ్రి ఎంతో సెంటిమెంటల్‌గా చెప్పే ఆ మాటలు వింటూంటే సంజీవకి కూడా తన బాల్యంలోని కొన్ని బలమైన జ్ఞాపకాలు గుర్తుకి వచ్చాయి.

"బాల్యం మధురంగా అనిపించడానికి కారణం ఆ వయసులో అమ్మనించి లభించే భద్రతా భావం ఎవరికీ, ఇంకే దశలో ఎక్కడా లభించకపోవడమై ఉండచ్చు సార్" సంజీవ చెప్పాడు.

"నాకోటి అర్థమైంది. చిన్నతనంలో పదే పదే విన్న పాటలు మనకి ఎంతో బావుంటాయి. పెద్దయ్యాక వింటూంటే మళ్ళీ మళ్ళీ వినాలనిపిస్తాయి. ఇంకా ఇంకా. అవి హిందీ పాటలై అర్థం తెలీకపోయినా, అప్పట్లో మనలో ఆ పాటలు ఎలాంటి భావోద్వేగాలని రేకెత్తించకపోయినా, ఆ బాణీ, ఆ లిరిక్స్, ఆ గాయకుల కంఠాలతో మనకో మానసిక బంధం ఏర్పడుతుంది. ఎంత బావున్నా తర్వాత విన్న పాటలు ఇంతగా కుదిపేయవు. మా వయసులోని అందరికీ ఇలాగే జరుగుతూంటుందా? కేవలం నాకేనా? ఇది తెలీడంలేదు." ఆయన చెప్పాడు.

"ఇలాంటి ఆలోచనలు కలగడానికి కొంతదాకా కారణం బహుశ అనారోగ్య, ఆర్థిక భయాలేమో? ఆ పీరియడ్లో ఇవేం ఉండవు కాబట్టి ఆ దశ కావాలని అనిపించచ్చు. అందుకే ఈ వయసులోని మీరు అందులోకి వెళ్ళి దాక్కోవాలని అనుకుంటున్నారేమో?" సంజీవ సూచించాడు.

"నాకా రెండు భయాలు ఇంతదాకా లేవనే అనుకుంటున్నాను. నిద్రలేచాక ఈ ఊహల్లో ఉంటూ ఓ పట్టాన లేచి ఈ లోకంలోకి రావాలని అనిపించదు. తలుపులు మూసి చీకటి చేసిన డొక్కు సినిమా హాల్లో, నలభై పైసల టిక్కెట్ క్లాస్‌లో సిగరెట్ పొగతో సావాసం చేస్తూ కూర్చుని సినిమా చూడటం, కొత్త క్లాసులోకి రాగానే పై క్లాస్ స్టూడెంట్ ఇంటికెళ్ళి, వాడి టెక్స్ట్ బుక్స్ సగం రేటుకి కొని, వాడి పేరు రాసిన లేబులున్న అట్టని తీసేసి కొత్త అట్ట నాన్నగారు వేస్తే నా పేరున్న లేబిల్‌ని అంటించడం, అందులో నెమలికన్నో, ఎండిన గులాబో కనపడితే ఆనందపడటం.. ఇవన్నీ నన్ను తరచు హాంట్ చేస్తున్నాయి. వాటికి దూరమైనందుకు మనసు భారమై కన్నీళ్ళు కూడా వస్తున్నాయి. ఐ మిస్ మై మదర్ వెరీ.. మా అమ్మ పోయినప్పుడు నాకు కలగని దుఃఖం ఇప్పుడు నాలో కలుగుతోంది. మా అమ్మ విరహం నన్ను చాలా బాధిస్తోంది. ఏడిపిస్తోంది. మా నాన్న ఇంకా బతికి ఉంటే బావుండేది అని ఎన్నిసార్లు అనుకున్నానో."

"ఇటీవల ఎవరో ఫార్వర్డ్ చేసిన ఓ వీడియో చూసాను సార్. మేరా నామ్ జోకర్లోని 'కహా గయె ఓ దిన్' అనే ముఖేష్ పాట నేపథ్యంలో కర్ర బిళ్ళ, బంతిని విసిరి తాకితే అవుటయ్యే ఆట, ముంతకింద పప్పు, పెట్రోమాక్స్ లైట్, గోలీలు టేప్ రికార్డర్ కేసెట్‌లోంచి బయటకి వచ్చిన టేప్‌ని పెన్సిల్‌తో చుట్టడం, పాత సిగరెట్ పెట్టెలు ఇలాంటివెన్నో చూపించారు. అవి చూసినప్పుడు నేను కూడా కొద్దిగా సెంటిమెంటలయ్యాను" సంజీవ చెప్పాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి
www.anandbooks.com
www.telugubooks.in